# నగరంలో ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ మ్యాచ్ ఫీవర్..!

## మెస్సీ ఆట చూసేందుకు యువత ఆసక్తి




**ఉప్పల్, జూలై 19 ప్రభాతవార్త :** ప్రపంచంలోనే అత్యంత ఆదరణ ఉన్న ఫిఫా ఫుట్ బాల్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేందుకు సిటీ జనులు పోటీపడ్డారు. ఆదివారం అర్ధ రాత్రి 12.30కు ప్రారంభం అయిన అర్జెంటీనా, స్పెయిన్ జట్ల తుది సమరాన్ని వీక్షించేందుకు పలుచోట్ల భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. హోటళ్లలో ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చింది ఉత్తర అమెరికా ఖండంలోని దేశాలు కావడంతో ఆయా దేశాల టైమ్ జోన్ మేరకు ఇప్పటికే సుమారు 40 రోజులుగా నగరంలోని ఫుట్‌బాల్‌అభిమానులు మ్యాచ్‌లను ఆస్వాదించారు. ఆదివారం జరిగే ఫైనల్ కోసం మరింత ఉత్సాహంగా తిలకించారు. హైదరాబాదీల అభిమాన ఆటగాడు లయోనల్ మెస్సీ సారథ్యంలో అభిమాన జట్టు అర్జెంటీనా పోటీ పడుతుంటే ఇక తెల్లవారుజాము వరకైనా మేల్కొన్నారు. స్పెయిన్ కంటే అర్జెంటీనానే మనవాళ్ల ఫేవరెట్ అని.. మెజారిటీ సిటీజనుల మొగ్గు అర్జెంటీనా వైపే అని హైదరాబాద్‌లోని ఫుట్‌బాల్ కోచ్‌లు, ఆటగాళ్లు పేర్కొంటున్నారు. 2022లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్లో ఫ్రాన్స్, అర్జెంటీనా తలపడగా అప్పుడూ మనవాళ్లు అర్జెంటీనాకే మద్దతు పలికిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఇక గత కొన్ని మ్యాచ్‌లలో ఓపెన్ స్క్రీనింగ్‌లో వచ్చిన స్పందన కూడా ఇదే విషయం స్పష్టం చేస్తోంది. గత ఏడాది చివర్లో మెస్సీ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంలో విశేష ప్రజాదరణ దక్కింది. అప్పట్లో కేరళ వంటి ఫుట్ బాల్‌కు ఆదరణ విపరీతంగా ఉండే రాష్ట్రంలో కాకుండా మెస్సీ భాగ్య నగరానికి రావడం విశేషం. దీన్ని బట్టే.. ఇప్పుడు అతడు వరుసగా రెండోసారి ప్రపంచ కప్ అందుకోవాలని హైదరాబాదీలు బలంగా కోరుకుంటున్నారు.

**భారీ స్క్రీన్‌లు ఏర్పాటు**

ఫిపా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో రెస్టారెంట్లు, క్లబ్‌లలో భారీ ఏర్పాట్లు చేశారు. ఫుట్‌బాల్ ఫైనల్ మ్యాచ్ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకునే, శనివారం అర్ధరాత్రి జరిగిన ఫ్రాన్స్ ఇంగ్లండ్ (మూడో స్థానం కోసం) మ్యాచ్, ఫైనల్ సందర్భంగా బార్లు, క్లబ్బు, మైక్రో బ్రూవరీలు రాత్రిళ్లు ఎక్కువసేపు తెరిచి ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో ఆదివారం పలుచోట్ల భారీ స్క్రీన్‌లు మ్యాచ్ తిలకించేందుకు ఏర్పాటు చేశారు. కాగా, ఈ నిర్ణయాన్ని ఫుట్‌బాల్ ఫైనల్‌కు తాత్కాలిక సడలింపుగా మాత్రమే కాక నగర నైట్ లైఫ్‌కు ఊపునిచ్చే దిశలో తొలి అడుగుగా ఆతిదజ్య రంగం భావిస్తోంది. ఈ అనుమతులను సద్వినియోగం చేసుకుని పూర్తి స్థాయి రాత్రి వేళ వ్యాపారాలకు బాటలు వేసుకోవాలని ఆశిస్తోంది. అభివృద్ధిదాయక నైట్ లైఫ్ నగరంలో సాధ్యమని నిరూపించడానికి ఇదొక సువర్ణావకాశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్ వార్త



# డ్రగ్స్ మహమ్మారిపై పోలీసుల సమరం

## ఏడాదిలో 563 కేసులు..రూ.22.17 కోట్ల డ్రగ్స్ స్వాధీనం.. డ్రగ్స్ రహిత హైదరాబాద్ ధ్యేయంగా కార్యాచరణ



**హైదరాబాద్ జూలై 19 ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో నిషేధిత డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడమే లక్ష్యంగా సిటీ పోలీస్ విభాగం బహుముఖ వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా కేవలం కేసుల నమోదుకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయి నిఘాను పటిష్ఠంచేయడం, సరఫరాదారుల నెట్‌వర్క్‌ను దెబ్బ తీయడం, వినియోగదారుల్లో పరివర్తన తీసుకు రావడం వంటి త్రైపాక్షిక కార్యాచరణను అమలు చేస్తోంది. లా అండ్ ఆర్డర్, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్‌న్యూ) సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక నిఘా ఫలితంగా జూన్ 2025 నుంచి ఈ ఏడాది జూన్ వరకు 563 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదయ్యాయి. ఈ దాడుల ద్వారా ఏకంగా రూ. 22.17 కోట్ల విలువైన నిషేధిత మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని ముఠాల గుట్టును సిటీ పోలీసులు రట్టుచేశారు. ఒకవైపు ప్రత్యేక ఆపరేషన్లతో సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తూనే, మరోవైపు బాధితులకు పునరావాసం కల్పిస్తూ డ్రగ్స్ రహిత వాతావరణానికి గట్టి పునాది వేస్తున్నారు. గత ఏడాది కాలంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను పరిశీలిస్తే, నగరంలో డ్రగ్స్ కట్టడికి పోలీసులు అనుసరిస్తున్న బహుముఖ వ్యూహం, క్షేత్రస్థాయి నిఘా స్పష్టమవుతోంది. 2025 జూన్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 563 ఎన్డీపీఎస్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విస్తృతిని జోన్లవారీగా విశ్లేషిస్తే, అత్యధికంగా జూబ్లీహిల్స్ జోన్ పరిధిలో 116 కేసులు నమోదు కాగా, ఆ తర్వాత వరుసగా సికింద్రాబాద్ జోన్ పరిధిలో 99 కేసులు, గోల్కొండ జోన్ పరిధిలో 95 కేసులు, చార్మినార్ జోన్ పరిధిలో 90 కేసులు నమోదయ్యాయి. అలాగే రాజేంద్రనగర్ పరిధిలో 84 కేసులు, ఖైరతాబాద్ పరిధిలో 49 కేసులు, శంషాబాద్ జోన్ పరిధిలో 30 కేసుల చొప్పున నమోదయ్యాయి. ఈ గణాంకాలు నగరంలోని నిర్దిష్ట ప్రాంతాలలో డ్రగ్స్ రవాణా, విక్రయాల నెట్‌వర్క్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించిన తీరును తెలియజేస్తున్నాయి. ఈ క్రమంలోనే పలు రకాల నిషేధిత డ్రగ్స్‌ను హైదరాబాద్ పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుకున్నారు. సీజ్ చేసిన మొత్తం రూ. 22.17 కోట్ల విలువైన డ్రగ్స్‌లో అత్యధిక భాగం గంజాయిదే కావడం విశేషం. ఇందులో భాగంగా రూ. 12.56 కోట్ల విలువైన 2,513 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయితో పాటు యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఇతర మత్తు పదార్థాల నియంత్రణ పైనా పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా ఏకంగా రూ. 6.91 కోట్ల విలువ కలిగిన 55.3 లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను జప్తుచేయగా, రూ. 1.62 కోట్ల విలువైన 1626 గ్రాముల ఎండీఎంఏ, రూ. 64.50 లక్షల విలువైన 129 గ్రాముల కొకైన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు రూ. 24 లక్షల విలువైన 120 గ్రాముల హెరాయిన్, రూ. 17.10 లక్షల విలువైన 570 ఎల్ఎస్‌డీ బ్లాట్లు, రూ. 1.25 లక్షల విలువైన 220 గ్రాముల ఓపియం కూడా సీజ్‌చేయడం ద్వారా నగరంలోకి ఎలాంటి డ్రగ్స్ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. కేవలం మాదకద్రవ్యాల సరఫరా మార్గాలపైనే కాకుండా, స్థానికంగా విక్రయాలు జరిగే ప్రధాన స్థావరాల నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇటీవల హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగార్ బస్తీలో ఏకంగా 1,100 మంది పోలీస్ సిబ్బందితో ఆపరేషన్ థండర్ బోల్ట్ పేరిట భారీ కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పెద్ద ఎత్తున గంజాయి, అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ నియంత్రణే ధ్యేయంగా భవిష్యత్తులోనూ ఆపరేషన్ థండర్‌బోల్ట్ పేరిట కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లను కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. డ్రగ్స్ మూలాలను సమూలంగా కట్టడి చేసేందుకు ఎన్సీబీ, డీఆర్ఐ, ఈగల్‌వంటి వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సహకారంతో పోలీసులు ముందుకు సాగుతున్నారు.

మరోవైపు, డీసీపీ హెచ్‌న్యూ పర్యవేక్షణలో అనుమానిత రౌడీషీటర్లు, వినియోగదారులకు క్షేత్రస్థాయిలోనే జరుపుతున్న డ్రగ్ నిర్ధారణ పరీక్షల ప్రక్రియ మరింత ఊపందుకుంది. ఇప్పటివరకు నగరంలో మొత్తం 1550 మందికి ఈ పరీక్షలు నిర్వహించగా, వారిలో 421 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇలా పట్టుబడిన బాధితులను కేవలం శిక్షలకే పరిమితం చేయకుండా ఒక మానవీయ కోణంలో పోలీసులు వ్యవహరిస్తున్నారు. వీరిని గాంధీఆసుపత్రి, ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య సంస్థతోపాటు ప్రముఖ ప్రైవేట్ పునరావాస కేంద్రాలకు తరలించి తగిన వైద్య సహాయంతోపాటు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇప్పిస్తూ వారిలో పరివర్తన తెచ్చేందుకు చొరవ చూపుతున్నారు. నేరాల అదుపుతో పాటు సామాజిక బాధ్యతను కూడా జోడించి పోలీసులు సాగిస్తున్న ఈ ప్రయాణం నగరంలో సానుకూల మార్పునకు దారితీస్తోంది. నగరంలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా తరిమికొట్టే విషయంలో పోలీస్ శాఖ అత్యంత సీరియస్‌గా ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జన తెలిపారు. నగర భవిష్యత్తు కోసం, రాబోయే తరాల శ్రేయస్సు కోసం డ్రగ్స్ రహిత హైదరాబాద్ నిర్మాణంలో ప్రజలంతా పోలీసులతో భాగస్వామ్యం కావాలని కోరారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే డయల్ 100కు కానీ లేదా హెచ్‌న్యూ విభాగం నంబర్: 8712661601 కు కానీ సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# కూలీ ఖాతాలో రూ.2.23 లక్షలు మాయం

**జూబ్లీహిల్స్, జూలై 19, ప్రభాతవార్త :** వాట్సాప్‌లో వచ్చిన నకిలీ ఆర్‌టీఓ చలాన్ సందేశాన్ని నమ్మిన ఓ రోజువారి కూలీ సైబర్ మోసగాళ్ల బారినపడి రూ.2.23 లక్షలకుపైగా నష్టపోయిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం..యూసుఫ్‌గూడ శ్రీరాంనగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్(27) రోజువారి కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 15న అతని వాట్సాప్‌కు ఆర్టీవో చలానా పేరుతో ఓ సందేశం వచ్చింది. ఆ సందేశాన్ని ఓపెన్ చేసిన అనంతరం సైబర్ నేరగాళ్లు అతడి వ్యక్తిగత వివరాలను సేకరించి, అతని పేరుతో అక్రమంగా వ్యక్తిగత రుణాన్ని తీసుకున్నారు. అంతేకాకుండా, అతడి కోటక్ మహీంద్రా బ్యాంకు ఖాతాకు అనధికారికంగా ఉపయోగించి, యూపీఐ లావాదేవీల ద్వారా రుణ మొత్తంతోపాటు అతని ఖాతాలోని వ్యక్తిగత నగదును వివిధ ఖాతాలకు బదిలీ చేశారు. ఈ ఘటనలో బాధితుడు మొత్తం రూ. 2,23,773.45 కోల్పోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రేమ పేరుతో వేధింపులు..

## ఫొటోగ్రాఫర్‌పై పోక్సో కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూలై 19, ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో ఓ బాలికను వేధిస్తూ, ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిన యువకుడిపై బోరబండ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బోరబండ సైట్3 ప్రాంతానికి చెందిన సుజల్ (19) ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఓ స్నేహితుడి ద్వారా పరిచయమైన బాలికకు ప్రేమ ప్రతిపాదన చేయగా బాలిక తిరస్కరించడంతో తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక అతని ప్రతిపాదనకు అంగీకరించింది. అనంతరం సుజల్ బాలికను పదేపదే వేధిస్తూ, ఆమె అనుమతి లేకుండా బలవంతంగా ముద్దుపెట్టుకోవడం, చేతులు పట్టుకోవడం, నడుమును తాకడం వంటి అసభ్యకర చర్య లకు పాల్పడ్డాడు. బాలిక అతనితో మాట్లాడడం మానేసినా, వెంట పడుతూ ప్రేమించాలంటూ ఒత్తిడి తీసుకొచ్చాడు. తనతో మాట్లాడాలని, బయటకు రావాలని, ప్రేమించాలంటూ మళ్లీ వేధించడంతో బాధిత బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయగా బోరబండ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 74, 78తో పాటు పోక్సో చట్టం సెక్షన్ 7, 8 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బోరబండలో ఒకే రోజు నలుగురు అదృశ్యం

**జూబ్లీహిల్స్, జూలై 19, ప్రభాతవార్త:** బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకే రోజు నలుగురు వ్యక్తులు అదృశ్యమైన వేర్వేరు ఘటనలు నమోదయ్యాయి. ఎర్రగడ్డ పీజీ హాస్టల్ నుంచి సుమిత్ భరత్ లంకపురే(19) కనిపించకుండా పోగా, కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన దినేష్ కుమార్ నుంచి "ఇదే నా చివరి సందేశం" అంటూ మెసేజ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మరో ఘటనలో షేక్ జకీరా అనే యువతి ఇంటి నుంచి అదృశ్యమైంది. అలాగే ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్బాని జగదీశ్వర్ ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనలపై బోరబండ పోలీసులు మిస్సింగ్ కేసులు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

# డ్రంకన్ డ్రైవ్‌లో 586 మంది పట్టివేత

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** జంట నగరాల్లో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రి వేళలో ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 586 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 439 మంది ద్విచక్ర వాహనదారులు, 45 మంది ఆటో డ్రైవర్లు, 97 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు, ఐదుగురు భారీ వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 121 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 241 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 126 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 62 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 22 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఏడుగు రు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ఏడుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం తాగినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 237 మంది...**

ఇదిలావుండగా సైబరాబాద్ పరిధిలో 237 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 205 మంది ద్విచక్ర వాహనదారులు. నలుగురు ఆటో డ్రైవర్లు, 28 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

# బంజారాహిల్స్‌లో రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాల చోరీ

**జూబ్లీహిల్స్, జూలై 19, ప్రభాతవార్త :**

బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని వ్యక్తులు రూ.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ప్రీతేష్ రమణి (26), గురుకృప ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన 14 బంగారు ఆభరణాలను (ఏడు నెక్లెస్‌లు, ఏడు జతల చెవిపోగులు) డైమండ్ ఫిక్సింగ్ కోసం బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని ఈడెన్ గార్డెన్‌లో ఉన్న లాకర్‌లో భద్రపరిచారు. మొత్తం ఆభరణాల బరువు 1,028.59 గ్రాములు కాగా, వాటి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో లాకర్‌ను పరిశీలించగా ఆభరణాలు కనిపించకపోవడంతో పాటు వాష్‌రూమ్ కిటికీ ధ్వంసమైనట్లు గుర్తించారు. దీంతో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



అవార్డులను ప్రదానం చేస్తున్న కెటిఆర్

# కళలను ప్రోత్సహించేందుకు అవార్డులు తప్పనిసరి

## బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్

**హైదరాబాద్, జులై 19 ప్రభాతవార్త :**

రాజకీయ జీవితంతో ప్రతి రోజు విమర్శలు, ప్రతి విమర్శల మధ్య గడుపుతున్న తమకు ఇలాంటి ఆహ్లాదకర మైన సాహిత్య, కళా వేదికల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. కళాకారులు, రచయితలు, కవులు, చిత్రకారులతో మమేకమయ్యే అవకాశం అరుదుగా లభిస్తుందని, ఇలాంటి సందర్భాలలో పాత జ్ఞాపకాలను, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తాయని ఆయన చెప్పారు. ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్ స్మారకార్థం ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్టూనిస్ట్ శేఖర్ మెమో రియల్ అవార్డు-2026 ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్టూన్ విభాగంలో కార్టూనిస్ట్ ఎం.నారు, ఆర్టిస్ట్ విభాగంలో చిత్రకారుడు కూరెళ్ళ శ్రీనివాస్‌కు కెటిఆర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ ప్రసంగిస్తూ ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానమనే సూక్తిని ప్రస్తావిస్తూ, సమాజం రాజకీయాలపై కార్టూన్లు చూపే ప్రభావం ఎంతో గొప్పదన్నారు. భారతదేశంలో ఆర్.కె. లక్ష్మణ్ లాంటి మహోన్నత కార్టూనిస్టులు చూపిన మార్గం చిరస్మరణీయమన్నారు. అంతర్జాతీయంగా బిల్ వాటర్సన్ సృష్టించిన క్యాల్విన్ అండ్ హాబ్స్ తనకు ఎంతో ఇష్టమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహాత్మాగాంధీ విలువలు, ఆయన చూపిన సిద్ధాంతాలు అవసరం మరింతగా పెరిగిందని, మత విశ్వాసాలు ప్రతి వ్యక్తికి వ్యక్తిగతమైనవని చెప్పారు. పరస్పర గౌరవంతో ముందుకు సాగడం సమాజానికి అవసరమని, జీవితంలో గెలుపు ఓటమిలు సహజమని, అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజలకు మేలు చేయడమే ప్రజా ప్రతినిధుల కర్తవ్యమని ఆయన వివరించారు. కళను ప్రోత్సహించేందుకు ఇలాంటి అవార్డులు తప్పనిసరిగ అని తెలుపుతూ ప్రతిభావంతులైన యువకళాకారులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యతని కెటిఆర్ వివరించారు.

# బోనాల జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

## ఎంపి అనిల్ కుమార్ యాదవ్

**చార్మినార్, జూలై 19 ప్రభాతవార్త :**

ఆషాడమాసం బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా ఆదివారం సిటీ కళాశాల సమీపంలోని శ్రీ తాటి మైసమ్మ దేవాలయంలో చార్‌మహల్ రజక సంఘం ఆధ్వర్యంలో వైభవంగా బోనాల జాతర పండుగ జరిగింది. మహిళలు భక్తి శ్రద్దలతో అమ్మ వారికి బోనాలు సమర్పించారు. రాజ్య సభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, లాల్‌సింగ్, శశికళతో పాటు పలువురు అమ్మ వారికి పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్తలు ఆమంచి సతీష్, టి.మహేష్, రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ బి.కృష్ణమూర్తి, గ్రేటర్ హైదరాబాద్ రజక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎం.నరసింహ, చార్‌మహల్ రజక సంఘం అధ్యక్షులు దామర నరసింగ్‌రావు, ఉపాధ్యక్షులు అందోల్ శంకర్, ప్రధాన కార్యదర్శి షాపురం రవి, కోశాధికారి అందోల్ బాలరాజ్, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొన్న ఎంపి అనిల్ కుమార్‌యాదవ్

# లష్కర్ బోనాల ఉత్సవాలకు అంకురార్పణ

## ఘనంగా ప్రారంభమైన ఘటం ఊరేగింపు... ఆలయంలో మంత్రి పొన్నం పూజలు, గణపతి హోమం



బోనాలలో పోతురాజుల నృత్యాలు



బోనాలను తీసుకెళుతున్న మహిళలు

**బేగంపేట, జూలై 19, ప్రభాతవార్త :** ఆషాడ మాసం వచ్చిందంటేనే లష్కర్‌లో డప్పుచప్పుళ్ల పోతు రాజుల నృత్యాలు ఫలాహారం బండ్ల ఊరేగింపులతో వాతావరణం మొత్తం సందడిగా మారుతుంది. సికింద్రాబాద్‌లోని శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఆషాడ బోనాల జాతర వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు నిర్వహించే అమ్మ వారి ఘటం అలంకరణకు సంబంధించిన విశేషసామాగ్రిని సంప్రదాయ బద్దంగా కర్బాలా మైదానానికి తీసికెళ్లారు. అక్కడ అమ్మవారి ఆలయంవద్ద ఘటం రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధరకాలైన పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమంలో పాల్గొన్నారు. ఆలయ పండితులు మంత్రికి ఆశీర్వచనం అందజేసి ప్రసాదాలను అందజేసారు. ఉత్సవాల ప్రారంభానికి ముందు ఆలయ మహా మండ పంలో ఈ ఓ గుత్తా మనోహర్‌రెడ్డి పర్యవేక్షణలో వేద పండితులు వేణుమాధవశర్మ, ఆలయ ప్రధానార్చకులు, ఎక్స్ అఫీషియో మెంబర్ రామతీర్థశర్మ గణపతి హోమం నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొ న్నారు. తెల్లవారు ఝాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం దేవాదాయ శాఖ అడిషినల్ కమీషనర్ కె.జ్యోతి, ఆలయ ఈఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ సురిటి కామేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులతో కల్సి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మ వారి ఘటానికి ఉప యోగించే అమ్మవారి ముఖ ప్రతిమ, పసుపు, కుంకుమ, ఇతర సామాగ్రిని సాంప్రదాయ బద్దంగా కర్బలా మైదానా నికి తీసికెళ్లారు. అక్కడి ఆలయం వద్ద అమ్మవారి ఘటం రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ భక్త జన సందోహం నడుమ డప్పుల చప్పుళ్లతో అమ్మ వారి ఎదుర్కోలు ఊరేగింపు కర్బలా మైదానంనుంచి సాయంత్రం దాటాక ఘనంగా ప్రారంభమైంది. దారి పొడువునా తాత్కాలికంగా విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసారు. ఘటం కర్బలా మైదానం డిస్టిలరీ రోడ్డు, పాన్‌బజార్, విక్టోరియా గంజ్ ప్రాంతాల గుండాసాగింది. విక్టోరియా గంజ్ జంక్షన్ వద్ద నేతలు బాబూరావు, ఎస్ఆర్‌మల్లేష్ శ్రీనివాస్ తదితరులు స్వాగత వేదికలు ఏర్పాటు చేసారు. దారి పొడవునా మహిళలు అమ్మవారి ఘటానికి హారతులు పడుతూ మహంకాళీ మాతాకీ జై అంటూ నినాదాలు చేసారు. ఊరేగింపు అట్టహాసంగా సాగింది. ఘటోత్సవంలో భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటుచేసారు. భక్తులకు అత్యవసర పరిస్థితు ల్లో వైద్య సేవలు అందించేందుకు డీఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి 250 మంది భక్తులకు వైద్యసేవలు అందించారు.

**భక్తులతో కిటకిటలాడిన ఆలయం**

శ్రీఉజ్జయినీ మహాకాళీ, మాణిక్యాలమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక యువకులు ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. నిర్వాహకులు అమ్మ వారి బోనం సమర్పించారు. జోగిని నాని, ప్రియా బోనం ఎత్తుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి వచ్చి అమ్మ వారికి బోనం సమర్పించారు. అమ్మ వారిని దర్శించుకున్నారు.

# ఘనంగా గోల్కొండ బోనాలు



గోల్కొండ బోనాలలో పోతురాజుల నృత్యాలు



భక్తులతో కిటకిటలాడిన దేవాలయం

